# ఇట్లో ఆకలి కేకన

**గురజాడ శోభాపేరిందేవి**

రైలు అందుతుందో లేదో అని గాభరాపడుతూ హడావిడిగా రైల్వేస్టేషన్‌కి వచ్చిన నేను రైలింకా రాలేదని తెలిసి నిట్టూర్చాను.

ఆ నిట్టూర్పులో హమ్మయ్యా! రైలింకా రాలేదు. కరెక్ట్‌గా వచ్చి ఉంటే ఈ పాటికి బయలుదేరిపోయేది నేను మిగిలిపోయేవాడిని అన్న భావనే ఉందో వెధవ రైలు నాదుంపతెంచింది. దీనికోసమే కదా నేను ఉరుకులు పరుగులతో వచ్చాను అన్న విసుగుదలే ఉందో నాకే అర్థకాలేదు.

జేబులోంచి రుమాలు తీసి మెడా, ముఖం తుడుచుకున్నాను. సిమ్మెంట్ బెంచి మీద కూలబడ్డాను.

చుట్టూ చూసాను.

స్టేషన్ ఎప్పటిలాగే ముగపెళ్ళివారి రాకకోసం ఎదురు చూస్తున్న ఆడ పెళ్ళివారిలాగా ఉంది.

ఓ ట్రూప్ ఇటువైపు వస్తోంది.

బరువైన చీరలు మేము మోయలేం బాబోయ్ ఈ పల్చటి చీరలే చాలు అని తెలియజేస్తున్నట్లుగా 'అష్‌ఉష్' అనుకుంటూ నడిచి వస్తున్నారు. పల్చటి చీరలే కట్టినా పయ్యెదని కూడా మోయలేనట్లుగా గాలికి వదిలేసిన ఆ ఆధునికులైన అతిలావున్న ఆడవాళ్ళు ఎన్నో నగలు ధరించారు మరివాటి బరువు ఎలా మోస్తున్నారో!

చక్రాలున్న సూట్‌కేస్‌లను ఈడ్చుకుంటూ వచ్చిన ఆ స్త్రీలు నాకు కాస్త దూరంలో నిలబడ్డారు.

వారు అలదుకున్నది విదేశీ సెంట్ కాబోలు చాలా హాయిగా ఉంది.

చెప్పద్దూ నాకు అసూయగా ఉంది. ఎందుకంటే వీళ్ళు పులుముకున్న సెంట్‌బాటిల్ ధర నాబోటి నిరుద్యోగి వెధవకి నెలమొత్తానికి కడుపునిండా తిండిపెట్టగలదు.

ధనలక్ష్మికి నిజంగా ఎంత పక్షపాతం! కొందరిని కటాక్షించినా ఇంకొందరి చేతులకి అందదు.

నా పక్కన నిలబడిన స్త్రీలను గమనిస్తూ ఆలోచిస్తున్నాను నేను. అందులో ఒకానొక అతివ నావైపు తీక్షణంగా చూసి జారిపోయిన కొంగును సవరించుకుంది. అంతటితో ఊరుకోక పక్కవాళ్ళకీ నన్ను చూపించి ఏదో చెప్తోంది.

నాకు వెర్రి నవ్వొచ్చింది.

అన్నానికి ముఖం వాచిఉన్న నేను ఆడదాని అందాన్ని గమనించే స్థితిలో ఉన్నానా?

ఇంక వాళ్ళవైపు చూడబుద్ధికాలేదు నాకు! వాళ్ళ చూపులకి చిర్రెత్తో, శారెత్తో కాదు.

అలా చూస్తూ కూర్చుంటే నా ఆకలి కడుపు వారిని చూసి ఎన్ని రాగాలు తీస్తుందో! ఆ రాగాలు భరించలేక నేను ఏ పాదుపనికి ఒడికడతానో!

నా చూపులు మరోపక్కకి మరలాయి.

ఆకలి అన్నమాట తప్ప మాకు ఇంకేమీ తెలీదు. అన్నాన్ని తప్ప మాకు ఇంక దేన్నీ చూడాలని లేదు అని తెలియచేస్తున్నట్లుగా నిలబడి ఉన్నారు ఇద్దరు భావిపౌరులు. లివర్ పొట్టలు, చిరిగి పేలికలవుతున్న బట్టలు, పుల్లముక్కల్లాంటి కాళ్ళూ చేతులు వారి సొత్తులా ఉంది. రైలుకోసం చూస్తున్న ప్రయాణికులందరినీ(నాతోసహా) అడిగి లేదనిపించుకున్న వాళ్ళు రైలు రాకకోసం ఎదురు చూస్తూఉన్నారు.

నాకు వాళ్ళని చూసి కూడా అసూయ కలిగింది. వాళ్ళకీ ఉన్నట్టే నాకూ ఆకలి ఉంది. కానీ వాళ్ళలాగ, అడుక్కుని తినగలిగే స్థితిలో లేను. ఎలా అడుక్కోగలను? ఆపని చేస్తే నాలోని గ్రాడ్యుయేట్ గుర్రుమనడూ!

ఆకలి చావైనా చావుకానీ అడుక్కుని మాత్రం తినకు అని అరిచి గీపెట్టడూ!

రైలు కోసం ఎదురు చూస్తున్న కూలీల మీద పడింది నాదృష్టి!

వాళ్ళలో నా వయసువారూ ఉన్నారు. కానీ వారి కళ్ళునాకళ్ళలాగ నిరాశగా, ఆవేదనగా, అశాంతిగా ఆ మూడింటినీ మించేసే ఆకలిగా చూడటంలేదు.

అవును మరి! వాళ్ళుకష్ట జీవులు. కష్టార్జితంతో కడుపునింపుకుంటారు.

మరినేనో! గ్రాడ్యుయేట్ని!

పుస్తకాలకి పుస్తకాలు బట్టీకొట్టి అప్పజెప్పెయ్యగల బలం బుర్రకి ఉందికానీ కూలీ చేయగల శక్తి ఈ చేతులకి లేదు.

ఇప్పుడు నేను వెడుతున్నది ఇంటర్వ్యూకి! ఇది ఎన్నో ఇంటర్వ్యూ ? అని నా స్నేహితులు (ఉద్యోగం వెలగబెడుతున్న వాళ్ళు) అడిగారు నిన్న! ఎంతసిగ్గు గలిగే ప్రశ్న అది! 'ఇది నీకు ఎన్నోసారి పెళ్ళిచూపుల పేరిట కూర్చోడం!' అని ఏ ఆడపిల్లనైనా అడిగితే ఆ పిల్ల ఎంత డెలికేట్‌గా ఫీలవుతుందో సరిగ్గా అలాగే ఫీలయ్యాను నేను. జవాబు చెప్పడానికి ఇష్టపడక మాట మార్చేసాను.

ఈ నిరుద్యోగం నాకు నేర్పిన పాఠాలు ఇవి—

ఆకలి కడుపుకి మంచి నీటిని అందివ్వడం, నిరాశ నీడలో నిలబడడం, సిగ్గూ లజ్జలను విడిచిపెట్టేసి నాన్న పెన్షన్ డబ్బుతో వండిన వంటని వంట బట్టించుకోవడం, ఆయనకి డబ్బు సరిగ్గా అందకపోయినా, ఆలస్యమైనా పస్తుపడుకోడం, "ఉద్యోగం దొరికిందా?" అని ఎవరైనా ప్రశ్నిస్తే ఓ వెర్రినవ్వుని జవాబిచ్చేసి ముందుకి మరలిపోవడం, కొన్ని ఉద్యోగాలు అందినట్లే అంది అంతలోనే వేళ్ళ సందుల్లోంచి జారే నీళ్ళలాగ జారిపోతుంటే గుండెనిరాయి చేసుకుని మరో ఉద్యోగం కోసం అప్లికేషన్ పడేయడం!

ఒకటా రెండా ఎన్ని నేర్పింది! ఈ అనుభవాల పుణ్యమా అని ఇంటర్వ్యూకి వెడుతున్నా కలలు కమ్మగా కమ్మేయవు.

ఆలోచనలకి ఎన్ని నిముషాలను బలిఇచ్చానో కాని రైలు రాబోతోందని అనౌన్స్‌మెంట్‌తో ఉలికి పడ్డాను.

'ఉట్టిగొడ్డుకి గాడ్పులెక్కువ' అన్నట్టు అనుకున్న టైముకి అరగంట అయినా ఆలస్యంగా వచ్చేరైలు ఇవాళ ఇంకింత ఆలస్యంగా వచ్చినా ఆర్బాటంగా అరుస్తూ రావడం మర్చిపోలేదు.

వీఐపి సూట్‌కేస్‌లు, హైహీల్స్ చెప్పులు ముందుకు సాగిపోతున్నాయి.

ప్రయాణికులకి, అమ్మకందార్లకి, కూలీలకి ముష్టివాళ్ళకి జేబుదొంగలకి అందరికీ హడావిడే!

ఏ సామానూ లేక నా సర్టిఫికేట్లఫైలు మాత్రమే ఉండడంతో నిదానంగానే రైలెక్కాను.

నాకున్నది ఒకే ఒక మంచి బట్టలజత! ఇదీఇంటర్వ్యూలకోసమే కుట్టించాను. ఆ పని పూర్తికాగానే మడతపెట్టి పరుపుకింద దాచిపెడతాను.

ఇంత పొదుపుగా వాడుతున్నా ప్యాంటూ షర్టూ వెలిసాయి. చిరగాలని తాపత్రయం పడుతున్నాయి.

ఆలోచిస్తూనే రైలెక్కిన నేను ఆరోచిస్తూనే జాగా వెదుక్కుని కూర్చున్నాను. అలా ఆలోచిస్తూండగానే రైలు బయలుదేరింది.

కళ్ళు మూసుకుని వెనక్కి జార్లబడ్డాను. నాపక్కన

**నా నుదురు దేనికి కొట్టుకుందోకాని వెచ్చటి రక్తం కంటి ప్రక్క నుండి బుగ్గ మీదికి జార్తోంది. నా ఎడం చెయ్యి ఏవిధంగా గాయపడిందో గాని విపరీతంగా సలుపుతోంది. కుడిమోకాలు చెక్కుకు పోయినట్లుంది.**

(సింగిల్ సీటైనా) మరో ఇద్దరు చేరారు.

సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగానికి నేను వెళ్ళే ఆఖరి ఇంటర్వ్యూ ఇదే! ఆపైన నావయసు నన్ను అనర్హుడిని చేస్తుంది.

కాని ఈ ఉద్యోగం నాకు దొరికే సూచన లేదు. లంచం ఇవ్వలేను. రికమెండేషన్ తెచ్చుకోలేను.

'ఈ ఉద్యోగాలకోసం ఎంత డబ్బుని, ఎంత కాలాన్ని, మరెంత శ్రమని వృధా చేసాను?'

ఈ గొడవేమి లేకుండా ఉండాలంటే ఉరిపోసుకుని చావాలి.

కానీ నేనాపని చెయ్యలేను. నా చదువుకోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబం ఇప్పటికే కూడు, గుడ్డకి ముఖం వాస్తోంది. నేడు కాకపోయినా రేపైనా అన్నయ్య ఉద్యోగస్థుడై తమని ఉద్ధరిస్తాడన్న ఆశావాదంతో చెల్లెళ్ళు తమ్ముళ్ళు బతుకుతున్నారు. ఆ ధైర్యంతోనే కన్నవారు కంటినిండా నిద్రపోగలుగుతున్నారు.

చచ్చే ధైర్యం లేని నన్నెవరైనా చంపేస్తే పీడ వదిలిపోతుంది.

నా ఆలోచనకి నవ్వొచ్చింది.

నేనేం ధనవంతుడినా డబ్బు దోచుకోడానికి పీక పిసికేందుకు? నేనేమైనా ఆడపిల్లనా మానం దోచుకుని మనిషిని హతం చేసేందుకు?

పోనీ ఈ రైలు కూలిపోతేనో!

ఆ ఆలోచన నాకెంతో నచ్చింది. హాయిగా చచ్చిపోవచ్చు.

'దేముడా నేనే కోరికా ఇప్పటిదాకా కోరిన గుర్తులేదు. ఒకటీ అరా కోరినా నువ్వు తీర్చిన గుర్తు అసలే లేదు. ఈ ఒక్క కోరికా తీర్చు తండ్రీ!' అని ప్రార్థిస్తూ కిటికీలోంచి చూసాను.

రైలు మెలికల పాములా ముందుకు పోతోంది. ఇక్కడా ఓటమే ఎదురవుతున్నట్టుంది నాకు!.

నిట్టూర్చాను ఆలోచనలిచ్చిన అలుపుకి మా గన్నుగా కునుకు పట్టింది. అలా ఎంతసేపు గడిచిందో!

పిడుగులు పడినట్లుగా పెద్ద చప్పుడైంది.

భూమి ఆకాశం ఏకం అవుతోందా?

ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కావడంలేదు.

నాకు అర్థమయ్యేసరికి రైలు పడిపోయింది.

ఆ చప్పుడుకి భయంతో స్పృహకోల్పోయినవారు కొందరైతే సామాన్లు మీదపడి స్పృహకోల్పోయిన వారు కొందరు. స్పృహఉన్నాదేని మధ్యో ఇరుక్కుపోయి బాధపడుతూ కూడా బయటపడలేక పోతున్నవారింకొందరు. ఎందరి ప్రాణాలు ఎగిరి పోయాయో, ఇంకా ఎందరివి ఎగిరే యత్నం చేస్తున్నాయో!

బతికి బట్టకట్టిన వాళ్ళున్నా గాయాలతో లేవ లేకుండా ఉన్నారు.

అరుపులూ, ఏడ్పులూ గోల!

నా నుదురు దేనికి కొట్టుకుందో కానీ వెచ్చటి రక్తం, కంటిపక్క నుండి బుగ్గమీదికి జార్తోంది. నా ఎడం చెయ్యి ఏవిధంగా గాయపడిందోకాని విపరీతంగా సలుపుతోంది. కుడిమోకాలు చెక్కుకుపోయినట్లుంది. ఆ ప్రాంతంలో ప్యాంటుచిరిగింది. రక్తం స్రవిస్తూ కిందకి జారుతోంది.

చావాలని కోరుకున్న నేను చావలేదు. కాని బతుకు అంటే వ్యామోహం కలవారెందరు కన్నుమూసారో ఊహించగలను.

భారంగా వాలిపోతున్న కళ్ళెత్తి చూసాను. నా ఎదురుగా కూర్చున్న వృద్ధ స్త్రీ కిందపడిపోయింది. ఆవిడ ప్రాణాలుపోయి అప్పటికే చాలాసేపైనట్టుంది. కట్టుకున్న చీర, జాకెట్టు అతిమామూలుగా ఉన్నాయి. ఆవిడ చెవులకి




మాత్రం రవ్వల దుద్దులు తళతళలాడుతూ మెరిసిపోతున్నాయి. అంత సామాన్యంగా ఉండీ ఆ దుద్దులేలా చేయించుకోగలిగిందో అని ఆలోచిస్తూ లేచేయత్నం చేయసాగాను.

ఒళ్ళంతా నొప్పులు! నాకెందుకో ఇప్పుడు చచ్చిపోవాలి అనిపించడంలేదు ఎలాగో ఒకలాగ బతికి బయట పడాలి అనిపించింది. అంతేకాదు వీలు పడినంతలో నా తోటివారిని కూడా బతికించే ప్రయత్నం చేయాలి అనిపించింది.

అతి కష్టమ్మీద లేచి నిలబడ్డాను. వృద్ధ స్త్రీ చేతి కిందపడి ఉన్న చిన్నపిల్లని సమీపించాను

ఆ పాపకి అయిదేళ్ళుం టాయేమో! అప్పర్ బెర్త్ మీంచి పడినట్టుంది. ఒంటి మీద కూడా కొన్ని సామాన్లున్నాయి. అవి తొలగించి ఆమెని రక్షించాలి అనుకుని ఆ పనిలో పడ్డాను.

వృద్ధురాలి చెయ్యి తొలగించబోయాను.

ఇంతలో 'ఆగండిసార్' అన్న గొంతు నీరసంగా వినిపించి చూసాను. వృద్ధస్త్రీ పక్కనే కూర్చుని ప్రయాణం చేసినతను మూల్గుతూ లేచాడో మూలనుండి! అతనూ నాలాగే బాగా గాయపడి ఉన్నాడు. వయసు కూడా నా అంతే ఉండి ఉంటుంది.

"మీరు మా అమ్మ బతికి ఉందోలేదో చూసి బతికి ఉన్నట్లయితే బయటికి చేరుద్దామని అనుకుంటున్నారు కదూ! ప్లీజ్ సర్! నా పని పూర్తయ్యాక మీపని చేసుకోండి."

"ఏమిటి మీపని?" అడిగాను.

భోపాల్‌లో
అలా జరిగింది!
ఆంధ్రభూమిలో
ఇలా జరిగితే?

**దేవుడే రక్షించాలి**

చెప్తానుసర్! మా అమ్మగారే ఈవిడ! తన డబ్బుని, శక్తిని నాకోసం హరించి చదువు చెప్పించింది. కాని ఉద్యోగం రాలేదు. నాకు ఇంకా కొన్నాళ్ళలో వయసు మీరి ప్రభుత్వఉద్యోగ అర్హత పోతుంది. అందుకని ఆ దుద్దులు ఇమ్మన్నాను. అవి అమ్మినట్లయితే డబ్బు వస్తుంది. దాంతో ఉద్యోగాన్ని కొనుక్కోవచ్చని నా ఆశ! కాని అమ్మకి నమ్మకం లేదు.

'ఇన్నాళ్ళూ నీ ఒక్కడికే అన్నీ చేసాను. నీ చదువువల్లే ఆడపిల్లలకి ఏమీ చేయలేదు ఇటు చదువులేక అటు డబ్బులేక వాళ్ళేలా బ్రతుకుతారు? అందుకే వీటిని అమ్మి వాళ్ళిద్దరికీ ఎవరికి తగిన వారికి వాళ్ళనిచ్చి చేసేస్తాను. అప్పుడు నేను చనిపోయినా బాధలేదు. అంది.

కానీ నేను ఉద్యోగం సంపాదించుకుని తీరాలి. అది దొరికితే చెల్లెళ్ళ సంగతి చూడనా? ఆ మాట ఆవిడ నమ్మదు. నీకు వ్యసనాలెక్కువంటుంది. ఏదో ఒకటి అంటూనే వచ్చింది. ఇప్పుడీ దుద్దులు ఊడబెరుక్కున్నానే అనుకోండి నాకెంత లాభం! ఉద్యోగం కొనుక్కోడం మాట అటు ఉంచండి. పేకాట కెళ్ళచ్చు. ఈ మధ్య నేను పేకాటల్లు అసలు ఓడిపోడంలేదు.'' అని చెప్తూనే ఆవిడని సమీపించి ప్రాణం పోయిందో లేదో కూడా చూడకుండా విసురుగా చెవులనుండి దుద్దులు ఊడబెరుకున్నాడు.

అతన్ని చూస్తేనే తెలుస్తోంది స్వభావం! అతగాడు స్వార్థపరుడనీ, జూదరని అదని ఇదని! దుద్దులు జేబులో పెట్టుకున్నాక అయినా అతను తల్లిని బయటికి తీసుకు వచ్చే ప్రయత్నం చేయలేదు తన పని అయిపోయినట్లుగా బయటికి నడిచాడు.

నాకు ఒక్కక్షణం ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నట్టుగా తోచింది.

తన స్వార్థం కోసం కన్నతల్లి దుద్దులు ఊడబెరుక్కున్న ఆ దుర్మార్గుడిని చూసాక నాకూ దుర్మార్గుడిని అవ్వాలని అనిపించింది.

అయితే అతనిలా స్వార్థం కొసం కాదు! నా కన్నవారి కోసం, వారు కన్న పిల్లలకోసం!

సహాయ కార్యక్రమం ఆరంభమవ్వకముందే నాకు సాధ్యపడినది నేను సంపాదించాలి అనుకుంటూ లేచి నిలబడ్డాను.

దోచుకోడం నేరమని పాపమని నాకప్పుడు అనిపించలేదు.

అన్నింటికంటే ఎక్కువగా మనిషిని పీక్కుతినేది ఆకలి.

ఆ ఆకలిని జయించాలి అంటే ఇలాంటి పనేదో చేయక తప్పదు అనుకుంటూ ముందుకు నడక సాగించా ను. నాకు మార్గం చూపిన దుర్మార్గుడి దారి వెదుకుతూ!

*